క్లుప్తంగా

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన


మర్రిపాలెంలో ప్రదర్శిస్తున్న కళాకారులు

గంగవరం : రంపచోడవరం ఐటీడీఏ పీఓ సూరజ్ గనోరే ఆధ్వర్యంలో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై గిరిజన గ్రామాల్లో కళాజాత ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు విభూతి బ్రదర్స్ కళా బృంద సభ్యులు తెలిపారు. మండలంలోని మర్రిపాలెం, కొమరవరం గ్రామాల్లో సోమవారం సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు, ఆరోగ్య జాగ్రత్తలపై చేసిన వీధి నాటకం, ఇంద్రజాల ప్రదర్శన గిరిజనులను ఆకట్టుకున్నాయి. రాజమండ్రికి చెందిన వీఎస్‌ఆర్ రూరల్ మీడియా పర్యవేక్షణలో ఈ ప్రదర్శనలను మండలంలో నాలుగు రోజులు పాటు పలు గిరిజన గ్రామాల్లో ప్రదర్శిస్తామని బృంద సభ్యులు శ్రీనివాసరాజు, వై.చిరంజీవి

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

మాకవరపాలెం: దివ్యాంగులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సు శిక్షణ ఇస్తామని మ్యుచువల్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ సతీష్ సోమవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి మే 15వ తేదీ వరకు దివ్యాంగులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్ టైపింగ్, ఎమ్మెస్ ఆఫీస్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తులను ఆధార్, సదరం ధ్రువీకరణ పత్రంతోపాటు నాలుగు ఫొటోలతో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9951938520 సంప్రదించాలన్నారు.985436

6 నుంచి అమ్మవారి ఉత్సవాలు


నూకాలమ్మ అమ్మవారు

అడ్డతీగల: మండలంలోని దుశ్చర్తిలో నూకాలమ్మ జాతర మహోత్సవాలు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకూ మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. శనివారం వేకువజామున 5 గంటల నుంచి అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు జరుపుతామన్నారు. అదే రోజు ఆలయ ప్రాంగణంలో జాగారం, కోలాటం, 7న గరగ నృత్యాలు, 8న పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులంతా అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

అనకాపల్లి: గంజాయి కేసులో ఇద్దరు ముద్దాయిలకు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ పదో అదనపు న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారని తెలిపారు. వివరాలు.. అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నారని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు 2015 ఏప్రిల్ 29న అప్పటి పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు పూడిమడక జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రాజమహేంద్రవరానికి చెందిన బూడిద మహాలక్ష్మీ ప్రసాద్, కుందాం హేమశంకర్ రెండు బ్యాగుల్లో 30 కేజీల గంజాయితో పట్టుబడ్డారని ఎస్పీ తెలిపారు. ఇరు పక్షాల వాదోపవాదాలు ముగిసిన అనంతరం తీర్పు వెల్లడించారు. నిందితులకు శిక్ష పడేలా ఏపీపీ వెంకటరావు వాదనలను వినిపించినట్లు ఎస్పీ చెప్పారు.

56 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: తోకరాయి గ్రామంలో గెమ్మెలీ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గెమ్మెలీ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రీమెలి సత్యనారాయణ మాట్లాడుతూ వైద్యాధికారి డాక్టర సోందొర ఆదేశాల మేరకు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించినట్టు చెప్పారు. శిబిరంలో 56 మందికి వైద్య పరీక్షలు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్లు గురుమూర్తి, పెద్దబ్బాయి, లక్ష్మణరావు, రాజు పాల్గొన్నారు.

పింఛనర్లపై ఎందుకీ కాఠిన్యం?

చింతూరు/వై.రామవరం/రాజవొమ్మంగి: ఒకటో తారీఖు వచ్చేసింది.. ఎప్పటిమాదిరిగానే తెల్లవారుజామున వలంటీర్ల అలికిడి లేదు. ఇంటి తలుపు తట్టిన చప్పుడు వినిపించ లేదు. ఉదయం 9 గంటల వరకు పండుటాకుల నుంచి దివ్యాంగుల వరకు ఆశగా ఎదురు చూశారు. పింఛన్ సొమ్ము ఇంకా చేతిలో పెట్టలేదని ఆలోచనలో పడ్డారు. ఇక వలంటీర్ రారని... పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లాలని వలువురు వారికి చెప్పారు.. ఈ వయసులో ఇన్ని కష్టాలా.. అని మదనపడ్డారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీరు వ్యవస్థపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కుట్రపూరితంగా ఫిర్యాదు చేయడంతో సోమవారం ఎంతోమంది పింఛన్‌దారులు ఇబ్బందులు పడ్డారు. మరలా కష్టాలు తెచ్చిపెట్టావా అంటూ చంద్రబాబుకు శాపనార్థాలు పెడుతున్నారు. అయితే అందుబాటులో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు కొందరు పింఛను డబ్బులు గురించి ఆందోళన చెందొద్దని, త్వరలోనే ప్రతి ఒక్కరికీ పింఛను సొమ్ములు అందుతాయని కబురు చెప్పారు. మరో కొద్ది రోజులు ఓర్చుకోండి. మళ్లీ మీ అందరి సహకారంతో జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా వస్తారు. అపుడు ఎప్పటిలాగే మీ ఇంటికే పింఛను డబ్బులు వస్తాయని వైఎస్సార్‌సీపీ నాయకులు చెప్పారు. సేవలందిస్తున్న వలంటీర వ్యవస్థను చంద్రబాబు అడ్డుకోవడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.


అంధురాలికి పింఛన్ ఇస్తున్న వలంటీర్(ఫైల్)

కుట్ర చేశారు..



జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత అన్ని పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయి. నాకు రూ.3 వేల వృద్ధాప్య పింఛన్, నా మనుమరాలికి సికిల్ సెల ఎనీమియా పెన్సన్ రూ. నెలకు 10 వేలు అందుతోంది.వలంటీర్లు మా ఇంటికి వచ్చి ఇచ్చేవారు.చంద్రబాబు,పవన్ కల్యాణ్ కుట్రలు చేసి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకుంటున్నారు. మంచి చేసే వారికి అడ్డుకోవడం మంచిది కాదు.వచ్చే ఎన్నికల్లో జగన్‌నే ముఖ్యమంత్రిని చేస్తాం.వలంటీర్ల సేవలు లేకపోతే మాకు చాలా ఇబ్బంది.
– శాంతమ్మ,గోమంగి, పెదబయలు మండలం

కదలలేని వారిపై కనికరం చూపరా?



కళ్లు కనిపించక, కాళ్లు సహకరించక తీవ్ర ఇబ్బందులతో ఉన్న మాలాంటి వారికి ముఖ్యమంత్రి జగన్ పుణ్యమా అని ఇప్పటివరకూ ఇంటి వద్దకే పింఛను వస్తోంది. ఇప్పుడు వలంటీర్లను ఆబాధ్యతలనుంచి తప్పించడంతో పింఛన్ కోసం నేను సచివాలయానికి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది.మాలాంటి వారిపై కనికరం చూపరా? –కువడం వలసమ్మ,
అంతర్ల, చింతపల్లి మండలం

పింఛన్లు ఇంటికాడే ఇవ్వాలి



నాకు ప్రతినెలా వృద్ధాప్య పింఛను వస్తోంది. ప్రతినెలా ఇస్తున్న మాదిరిగానే వలంటీర్ల ద్వారా మా పింఛన్లను ఇంటికాడే ఇవ్వాలి. గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఇంటివద్దకే మాకు పింఛను అందుతుండడంతో బాధలు తీరాయి. –తుర్రం ముత్తమ్మ, ఎర్రంపేట, చింతూరు మండలం

చంద్రబాబు కుటిల రాజకీయం



గతంలో పింఛను కోసం ఆఫీసుల చుట్టు కాళ్లరిగేలా తిరిగేవాళ్లం. సీఎం జగన్ పాలనలోని ఈ ఐదేళ్లలో ఆ ఇబ్బంది లేకుండా గ్రామ వలంటీర్లు ఇంటికొచ్చి పింఛన్ సొమ్ము అందజేశారు. చంద్రబాబు కుట్ర రాజకీయాల వల్ల తిరిగి పింఛన్ కష్టాలు మొదలయ్యాయి. ఇప్పుడు గతంలో మాదిరిగానే ఆఫీసుకు వెళ్లి పింఛను తీసుకోవాలంటున్నారు. చంద్రబాబు కక్షరాజకీయాలకు మా లాంటి పేదొళ్లు బలైపోతున్నారు. – మజ్జి రమణ, రాజవొమ్మంగి)

వలంటీర్లపై చంద్రబాబు బురదజల్లడం దారుణం



నిరుపేద కుటుంబానికి చెందిన నేను వై.రామవరంలో నివాసముంటున్నాను. నాకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నా పింఛన్ అందలేదు. నా కొడుకులా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వృద్ధాప్య పింఛన్ ఇచ్చి నన్ను ఆదుకున్నారు. పేదలకు అన్ని సంక్షేమ పథకాలు అందించడానికి గ్రామ వాలంటీర్లను నియమించారు. కరోనా కష్ట కాలంలో నేను రంపచోడవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మా వలంటీర్ ఒక్క పైసా ఆశించకుండా ఆస్పత్రికి వచ్చి పింఛన్ ఇచ్చారు. సీఎం జగన్ అందిస్తున్న రూ.3వేల పింఛన్‌తో జీవనయానం సాగిస్తున్నాను. ఐదేళ్లుగా నిర్విరామంగా నిస్వార్థంగా సేవలందిస్తున్న గ్రామ వలంటీర్లపై చంద్రబాబు బురదజల్లడం దారుణం. వలంటీర్ల సేవలను మాలాంటి పేదల్ల నుంచి దూరం చేశాడు. పేదలందరు గుణపాఠం చెబుతారు.
– పల్లాల లక్ష్మమ్మ, వై.రామవరం

ఇబ్బందికి గురిచేయడం తగదు



వేసవిలో మాలాంటి వృద్ధులను ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదు. అసలే ఎండలు మండిపోతున్నాయి. వయస్సు మీదపడడంతో నడిచి వెళ్లలేని పరిస్థితి. ఆరోగ్యం సహకరించడం లేదు. ఇప్పుడు పింఛన్‌ను కోసం కాలినడకన సచివాలయాలకు వెళ్లమనడం తగదు.
–సురగం లక్ష్మణరావు, అంతర్ల, చింతపల్లి మండలం

ప్రతిపక్షాల కుట్ర



వలంటీర్లు సేవలందిస్తే ఓట్లు పోతాయని ప్రతిపక్షాలు కుట్రపూరితంగా వలంటీర్ల సేవలను అడ్డుకున్నారు. పింఛన్లతో పాటు మరెన్నో పథకాలు ప్రతి ఇంటికీ చేరుస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయం. ప్రతినెలా నాకు వృద్ధాప్య పింఛను ఇంటికీ వచ్చేది. ఈ నెల సచివాలయాకి వెళ్లి తీసుకోమని చెబుతున్నారు. అక్కడకు వెళితే గతంలో మాదిరిగా ఎండలో పడిగాపులు పడాల్సి వస్తుంది.
–మడివి పెంటయ్య, చింతూరు

వలంటీర్ల సేవలు మరువలేనివి



కరోనాతో పాటు ఇతర సమయాల్లో వలంటీర్లు అందిస్తున్న సేవలు మరువలేనివి. నాకు ప్రతి నెలా వితంతు పింఛను రూ 3.వేలు ఇంటికే తెచ్చి అందిస్తున్నారు. కన్నబిడ్డల మాదిరిగా సేవలు అందిస్తున్న వలంటీర్ల సేవలను చంద్రబాబు అడ్డుకోవడం సరికాదు. –మడివి బుచ్చమ్మ,
ఎర్రంపేట, చింతూరు మండలం

వలంటీర్ల నిస్వార్థ సేవలు



ఈ నెల పింఛన్ ఇచ్చేందుకు వలంటీర్లు రాలేదు. చూసి చూసి చితుకుల కోసం అడవికి వెళ్లిపోయాను. రెక్కాడితే కాని డొక్కాడని మా వంటి అభాగ్యులకు సీఎం జగన్ ఇస్తున్న రూ.3వేలు పింఛను కానుక ఒక వరం . ఐదేళ్లుగా నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు కక్షగట్టడం దారుణం. కరోనా కష్ట కాలంతో పాలు అన్ని వేళలు వలంటీర్లు నిస్వార్థ సేవలందించారు. వలంటీర్లు మాలాంటి పేదోళ్లకు ఎంతో సేవ చేశారు. వారి సేవలను ఆపడం దారుణం. – చిన్ని అప్పలరాజు, రాజవొమ్మంగి

నేడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ప్రచారం

అడ్డతీగల: మండలంలోని నాలుగు పంచాయతీల్లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్టు అడ్డతీగల సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి తోట రాజేశ్వరరావు తెలిపారు. 3 గంటలకు పులిగోగులపాడు పంచాయతీ, 4 గంటలకు కిమ్మూరు పంచాయతీ, 5 గంటలకు గొంటివానిపాలెం పంచాయతీ, 6.30 గంటలకు తిమ్మాపురం పంచాయతీలో ఎమ్మెల్యే ధనలక్ష్మి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు హాజరుకావాలని కోరారు.

వై.రామవరం: మండలంలోని దేవరమడుగుల, చవిటి దిబ్బలు, పూతిగుంట, పనసలపాలెం, రాచపాలెం, పి.యర్రగొండ, పైడిపుట్ట, వై.రామవరం, చింతకర్రపాలెం, యార్లగడ్డ గ్రామాల్లో ఎమ్మెల్సీ అనంతబాబు మంగళవారం పర్యటించి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఎంపీపీ కడబాల ఆనందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, పత్రికా సోదరులు, తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

సక్రమంగా పింఛన్ల పంపిణీకి చర్యలు

గూడెంకొత్తవీధి/రాజవొమ్మంగి: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సామాజిక పింఛన్ల పంపిణీలో వలంటీర్లను దూరంగా ఉంచినట్టు జీకే వీధి, రాజవొమ్మంగి ఎంపీడీవోలు ఉమామహేశ్వరరావు, యాదగిరీశ్వరరావు వేర్వేరుగా చెప్పారు. పింఛన్లు సక్రమంగా పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా మండలాల్లో జరిగిన సమావేశాల్లో పింఛన్ల పంపిణీకి సంబంధించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

సంక్షేమ పథకాల ప్రదాతకు పట్టం కడదాం

- జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపిద్దాం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు


గిరిజనులతో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు


సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న లక్ష్మణ్‌కుమార్,నాయకులు

పాడేరు : ఐదేళ్ల కాలంలో రామరాజ్యం స్థాపించి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు గడప వద్దకే అందించి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు స్పష్టం చేశారు. మండలంలోని మారుమూల కించూరు, గొండెలి, బడిమెల పంచాయతీల పరిధిలోని వంటివీధుల, వల్లాయి, కించూరు, గొండెలి, లింగాపుట్టు గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటా వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ వేడుకల్లో గ్రామస్తులతో కలిసి ఆయన కొద్దిసేపు థింసా నృత్యం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, స్థానిక సర్పంచ్‌లు వంతాల రాంబాబు, సోమెలి లక్ష్మణరావు, కుర్రబోయిన సన్నిబాబు, గబ్బాడ చిట్టిబాబు, వనుగు బసవన్నదొర, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, జోనల్ ఇన్‌చార్జ్ కిముడు విశ్వ, జేసీఎస్ మండల కన్వీనర్ పలాసి కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పలాసి రాజేశ్వరి, కె.నర్సింహమూర్తి, ఎల్.రామకృష్ణ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్/అనంతగిరి/హుకుంపేట/జి.మాడుగుల/కూనవరం/మారేడుమిల్లి: మండలంలోని పద్మాపురం పంచాయతీలో భీముడువలస, శీరాలమామిడివలస, రణజిల్లెడ, గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీగా తనూజరాణి, ఎమ్మెల్యే మత్స్యలింగంను గెలిపించాలని కోరారు. నాయకులు శెట్టి అప్పాలు, రామ్మూర్తి, సుంక్ర, రాంబాబు, జీనబంధు,అప్పలస్వామి,రాజ్‌కుమార్, లచు,నర్సింగ్,తదితరులు పాల్గొన్నారు. అనంతగిరి మండలంలోని లంగపర్తి పంచాయితీ నేలపాలెం,మెట్టవలస,వంతెనగరువు గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిని స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మేము సిద్ధం... మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. సర్పంచ్‌లు సన్యాసిరావు, నేతలు గంగన్నదొర, నవీన్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు. డుంబ్రిగుడ మండలంలోని గుంటగన్నెల పంచాయతీ కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌లు వంతల వెంకటరావు, సుబ్బారావు, పీఏసీఎస్ చైర్మన్ మొద్దు, జేసీఎస్ కన్వీనర్ గణపతి, నాయకులు పాపారావు, నగేష్, తునాథ్ తదితరులు పాల్గొన్నారు. హుకుంపేట మండలంలోని గన్నెరుపుట్టు పంచాయతీ గెడ్డవలస,గవలమామిడి, పొర్లు ,కంగారు మామిడి, రంగసింగిపాడు గ్రామాల్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండలరావు, నాయకులు సదాశివరాజు,రాజరావు,అప్పన్న తదితరులు పాల్గొన్నారు. జి.మాడుగుల మండలంలో కరకపల్లి గ్రామంలో నాయకులు గబ్బాడి శేఖ, సచివాలయ కన్వీనర్ గబ్బాడ చిట్టిబాబు, వార్డు నెంబర్ వి తిరుపతిరావు, రాంబాబు, సత్తిబాబు, బంగారుదొర, రామారావు, గృహసారథులు, తదితరులు పర్యటించి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని గ్రామస్తులను కోరారు. కూనవరం మండలంలోని కరకగూడెం, వెంకటాయపాలెం, బోరునూరు, పాలగూడెం, మొట్ట రామవరం వెంకటాయపాలెం గ్రామాల్లో మండల జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాజీ వైఎస్ ఎంపీపీ బాబు, పాపారావు, దివాకర్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు. మారేడుమిల్లి మండలంలోని చట్లవాడ పంచాయతీ పరిధిలో డోలగండి, దుక్కి చెలక గ్రామాల్లో ఏఎంసీ డైరెక్టర్ దూడ స్మిత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీగా తనూజరాణి, ఎమ్మెల్యేగా నాగులపల్లి ధనలక్ష్మిని గెలిపించాలని కోరారు.


పొర్లు గ్రామంలో గిరిజనులతో పార్టీ నాయకులు


కరకపల్లిలో పర్యటిస్తున్న మండల నాయకుడు శేఖర్, నేతలు


కరకగూడెం సచివాలయం పరిధి బోదునూరులో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు


నేలపాలెం గ్రామంలో గిరిజనులతో నాయకులు


డోలగండిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఏఎంసీ డైరెక్టర్ దూడ స్మిత్


గుంటగన్నెలలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మల్లేశ్వరరావు

నవోదయకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక


నెహల్,


యాక్షిత


వీక్షిత్‌అభిరామ్

ఎటపాక/రాజవొమ్మంగి: నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఎటపాక, రాజవొమ్మంగి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా ఎటపాక మండలంలోని పురుషోత్తపట్టణం, నెల్లిపాక ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు కోట యాక్షిత, నక్కా వీక్షిత్ అభిరామ్‌లు ఎంపికైనట్టు హెచ్‌ఎంలు ప్రసాద్, జయ తెలిపారు. అదే విధంగా రాజవొమ్మంగి మండలంలోని కింద్రకాలనీ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి కుడకల నెహల్ ఎంపికైనట్టు హెచ్‌ఎం ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో సోమవారం జరిగిన కార్యక్రమాల్లో ఆయా విద్యార్థులను హెచ్‌ఎంలు తదితరులు అభినందనలు తెలిపారు.

పుచ్చకాయలకు గిరాకీ


అరకులోయలో విక్రయిస్తున్న పుచ్చకాయలు

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో పుచ్చకాయల విక్రయాలు జోరుగా సాగుతోంది. వేసవి తాపానికి తాళలేక అరకులోయ పట్టణ ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుండి మండల కేంద్రానికి వస్తున్న ప్రజలు పుచ్చకాయల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. మాడుగుల వడ్డాది గ్రామానికి చెందిన రామకృష్ణ అనే యువకుడితో పాటు మరో ముగ్గురు యువకులు తాగేవల్లి గూడెం నుంచి పుచ్చకాయలు కొనుగోలు చేసి, ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పది క్వింటాళ్ల పుచ్చకాయలు రూ. 30 వేలకు కోసుగోలు చేశామని, వారం రోజుల్లో మొత్తం అమ్ముడైనట్టు, ఆదాయం బాగుందన్నారు. పుచ్చకాయలకు డిమాండ్ ఉండడంతో రానున్న రోజుల్లో మరింత లాభాలు పొందవచ్చని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన


విద్యార్థులకు మేలుకొలుపు పుస్తకాలను అందజేస్తున్న వినియోగదారుల సంఘం ప్రతినిధులు

పాడేరు : వినియోగదారుల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండి ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బూడిదే చిట్టిబాబు స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ముద్రించిన మేలుకొలుపు పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో ఇళ్లకు వెళ్లినప్పుడు పరిసరాల గిరిజనులకు వినియోగదారుల హక్కులు, చట్టాలు, తూనికలు, కొలతలు, వస్తువు యొక్క నాణ్యత ప్రమాణాలు తదితర వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. వినియోగదారుడు ఏ వస్తువు ఎక్కడ కొనుగోలు చేసినా తప్పనిసరిగా తగిన రశీదు పొందాలన్నారు. సంఘం ప్రతినిధులు రమేష్, బాలరాజు, ఉపాధ్యాయులు కేశవరావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన


కూనవరంలో మానవహారం నిర్వహిస్తున్న తహసీల్దార్ ఆర్‌వీ మురళీకృష్ణ


వై.రామవరంలో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

కూనవరం/వై.రామవరం: ఓటు హక్కుపై అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కూనవరం, వై.రామవరం మండలాల్లో సోమవారం ఓటు ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. కూనవరంలో తహసీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో టేకులబోరు నుంచి కూనవరం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వై.రామవరంలో డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకరరావు ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కళాకారులు నాటక రూపంలో తెలియజేశారు. ఆర్ఐ సత్యనారాయణ, వీఆర్వో వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటన రేపు

కూనవరం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి బుధవారం సాయంత్రం 3.00 గంటల నుంచి మండలంలో పర్యటించనున్నట్టు అడ్డతీగల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పెదార్కూరు పంచాయతీలో పెదార్కూరు, రేపాక, కరకగూడెం పంచాయతీలో బోదునూరు, పాలగూడెం, వెంకటాయపాలెం పంచాయతీలో వెంకటాయపాలెం, సరిహద్దు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని అడ్డతీగల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు తప్పనిసరిగా హాజరు కావలసిందిగా కోరారు.

90 మద్యం సీసాల స్వాధీనం

పరవాద: లంకెలపాలెం ప్రాంతంలో ఓ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి సబ్బవరం మండలం అమృతపురం గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 90 మద్యం సీసాలను సీఐ ఎస్.బాల సూర్యారావు సోమవారం కన్నూరు గ్రామం వద్ద స్వాధీనం చేసుకున్నారు. అమృతపురం గ్రామానికి చెందిన గండి సత్తిబాబుపై కేసు నమోదు చేశామని సీఐ బాలసూర్యారావు చెప్పారు. ఈ దాడిలో ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.